ఉష్ణోగ్రత (అంచనా)

21-4-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	41	27
తెనాలి	39	26
నరసరావుపేట	40	25
బాపట్ల	37	27
రెంటచింతల	41	26

తమ్ముళ్లలో.. వజ్రోత్సాహం



కొల్లూరు : కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



బాపట్ల : ఏరియావైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి తదితరులు

- అధినేతకు అభిమానుల నీరాజనాలు
- వాడవాడలా చంద్రబాబు జన్మదినోత్సవాలు
- రక్త.. అన్నదానాలు.. రోగులకు పండ్లు పంపిణీ
- కేకులు కట్ చేసి సందడి చేసిన టీడీపీ శ్రేణులు

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి 75వ జన్మదినోత్సవాన్ని జిల్లా అంతటా తెలుగు తమ్ముళ్లు.. అభిమానులు ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వజ్రోత్సవ వేడుకలను వాడవాడలా టీడీపీ శ్రేణులు, నాయకులు, అభిమానులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పల్లెలు.. పట్టణాల్లో అట్టహాసంగా వేడుకలు జరిగాయి. రక్తదాన శిబిరాల్లో యువకులు రక్తదానం చేసి అధినేతపై అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ పార్టీ నేతలు, శ్రేణులు చర్చిలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్న తమ అధినేత నిండు నూరేళ్ల వర్ధిల్లాలని శ్రేణులు కోరుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లాలో పలు చోట్లు అన్నదానాలు జరిగాయి. టీడీపీ కార్యాలయాలతో పాటు పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్లలో చంద్రబాబు జన్మదినోత్సవ కేకులను ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు కట్ చేశారు. స్వర్ణాంధ్ర లక్ష్యంగా చంద్రబాబు పాలన చేస్తున్నారని నేతలు తెలిపారు. బాపట్లలోని పార్టీ కార్యాలయంలో శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వేమూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. కొల్లూరులో 75 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ఆనందబాబు కట్ చేశారు. తొలుత క్రాప రోడ్డు నుంచి భారీ ర్యాలీగా తరలి వస్తూ గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. 75 కిలోల కేక్‌ను కట్ చేసి అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టిన పార్టీ శ్రేణులను ఆనందబాబు అభినందించారు. అమృతలూరులోని బాబుజగ్జీవన్‌రామ్ పార్కు వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది. చెరుకుపల్లిలో టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించగా అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం 20 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అనగానిశివప్రసాద్ ప్రారంభించారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించి అక్కడ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పర్చూరు నియోజకవర్గం కారంచేడులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు నిర్వహించాయి. అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్‌చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.



చీరాల : రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



రేపల్లె : ఎన్టీఆర్‌సర్కిల్లో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



అద్దంకి : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



బాపట్ల : ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన కేక్ కట్ చేస్తున్న రైల్వేబోర్డుమెంబరు పఠాన్ రాజేష్ తదితరులు



పర్చూరు : కారంచేడులో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



పేదలకూ.. కార్పొరేట్ విద్య

- ఆర్టీఈ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు ఉచితం
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- వచ్చే నెల 15 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం
- న్యాయ సమస్యలు తలెత్తకుండా పక్కాగా అమలుకు ప్రణాళిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5000 మందికిపైగా అవకాశం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోలా కాకుండా పక్కాగా పేదలకు కార్పొరేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం విద్యా హక్కు చట్టానికి(ఆర్టీఈ) సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాహక్కు చట్టం ద్వారా పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25% సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పరిధిలో ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 5 వేలకు పైగా పేద విద్యార్థులు అడ్మిషన్లు పొందనున్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో విద్యా హక్కు చట్టం ద్వారా సీట్లు వచ్చినా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించలేని దుస్థితి నెలకొంది. గడిచిన ఐదేళ్లలో ఈ చట్టాన్ని అస్తవ్యస్తంగా అమలు చేయడంతో పేదలు ఆ అవకాశాన్ని పొందలేకపోయారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించి విద్యా హక్కు చట్టం అడ్మిషన్లకు నిరాకరించాయి. ప్రైవేట్ యాజమాన్యాలకు దీటుగా గత ప్రభుత్వం న్యాయపరమైన అంశాల్లో నిర్లక్ష్యం వహించింది. దీంతో విద్య హక్కు చట్టం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజులు చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది విద్యార్థులు సీట్లు వచ్చినా యాజమాన్యాల వేధింపుల కారణంగా చేరకుండా ఇతర పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈ సారి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సమగ్ర శిక్ష ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 400కు పైగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా కేటాయించాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందే విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

అర్హులు.. దరఖాస్తు ఇలా..

విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, ఓసీలో విభిన్న ప్రతిభావంతులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు ఆర్టీఈ ప్రవేశాలకు అర్హులు. ఆయా వర్గాల విద్యార్థులు తమ సమీపంలోని ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్సీ, స్టేట్ సిలబస్‌లో బోధన అందించే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్, ఇతర ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో మే 15 నుంచి 20వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి. అదేవిధంగా సచివాలయాలు, మండల విద్యా వనరుల కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఇతర సమాచారం కోసం 1800 42 58 599 అనే టోల్ ఫ్రీ ద్వారా తెలుసుకోవచ్చని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక తెలిపారు. మే 21 నుంచి 24లోగా మొదటి విడత అర్హుల జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.



ఎప్పుడిస్తారో...

- రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరులో జాప్యం
- తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సంక్రాంతి.. ఉగాది అన్నారు.. దసరాకైనా ఇచ్చేనా
- ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న దరఖాస్తు దారులు

అధికారంలోకి రాగానే కొత్తగా రేషన్ కార్డులు ఇస్తాము. అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేస్తాము.. అన్నారు. అయితే మరో నెలన్నరకు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. అయినా ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు, సామాజిక పింఛన్ల ఊసే లేదు. ప్రభుత్వం నుంచి వీటి పై కనీస ప్రకటనలు కూడా ఉండటంలేదు. దీంతో కార్డులు, పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో కూడా అత్యధికంగా కార్డులు, పింఛన్ల కోసమే పలువురు దరఖాస్తులు అంద జేస్తున్నారు. ఒకే కుటుం బంలో తల్లి, తండ్రి, కుమారుడు, కోడలు ఉంటే రేషన్ కార్డులు వేరుగా తీసుకు నేందుకు దంపతులు ఆసక్తి చూపు తున్నారు. సంక్రాంతి అన్నారు. ఆ తర్వాత ఉగాది అన్నారు. ఆయా పండుగులు వచ్చాయి.. పోయాయి అయినా కార్డులు, పింఛన్ల జాడలేదు. ఈ పరిస్థితుల్లో దసరాకైనా ఇస్తారా అని ఆశావాహులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో, ప్రజాప్రతినిధుల పర్యటనల్లో దరఖాస్తు దారులు నిలదీస్తుండటంతో ఏమి చేప్పాలో తెలియక ఆయా నేతలు నీళ్లు నములు తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కొత్త కార్డులు.. పింఛన్ల మంజూరులో జాప్యం జరుగుతోంది. పింఛన్లు, కార్డుల ఊసే ప్రభుత్వం ఎత్తకపోతుండటంతో దరఖాస్తుదారులు తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రజాప్రతినిధులను, గ్రామ.. వార్డు స్థాయిలో నేతలను నిలదీస్తున్నారు. దీంతో కూటమి నేతలు ప్రజల వద్దకు వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామంటూ గతంలో ఎమ్మెల్యేల ప్రకటనలతో తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కార్డులు, పింఛన్ల కోసం వేలాది మంది అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను ఎమ్మెల్యేలు అధికారులకు సిఫార్సు చేస్తున్నారు. అయితే రేషన్ కార్డు, పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

వైసీపీ హయాంలో రాజకీయ కక్షతో తొలగింపులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర వేసి పింఛన్లు, రేషన్ కార్డులను పెద్దసంఖ్యలో తొలగించారు. వైసీపీ నేతల సిఫార్సులతో అనర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేశారు. దొంగ మెడికల్ ధ్రువపత్రాలు సృష్టించి దివ్యాం గుల కోటాలో వందలాది మంది అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారు. ఆయా పింఛన్లపై కూటమి ప్రభుత్వం చేపట్టిన విచారణ నత్తనడకన సాగుతోంది. అనర్హులను తొలగించి అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నా వారి మొర ఆలకించే వారే కరువయ్యారు.

ఇంకా జగన్ ఫొటోలతోనే కార్డులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా ఇంకా మాజీ సీఎం జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాలతోనే రేషన్ కార్డులు ఉన్నా యి. వీటిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఫొటోలు ఉన్న కార్డులను మారుస్తామని, వాటి స్థానంలో కొత్త కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందే తప్ప అమలును విస్మరించిందన్న విమర్శలున్నాయి.

మూడు జిల్లాల్లో 30,796 కార్డులు రద్దు

కొత్తగా పంపిణీ ఎలా ఉన్నా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులను భారీగానే రద్దు చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. జూలై 2024న ఉన్న రేషన్ కార్డుల సంఖ్యకు ఈ నెలలో రేషన్ కార్డుల సంఖ్యకు వేలల్లో ఉన్న వ్యత్యాసం కనిపిస్తోంది. జూలైలో పల్నా డు జిల్లాలో 6,45,110 కార్డులు ఉండగా ప్రస్తుతం 6,34,893 కార్డులు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డులకు 5,88,874 ఉన్నాయి. ఇక బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డులకు 4,76,087 మాత్రమే ఉన్నట్లు సంబంధిత పోర్టల్ ద్వారా అర్థమవుతోంది. అంటే పల్నాడు జిల్లాలో 10,217, గుంటూరు జిల్లాలో 10,637, బాపట్ల జిల్లాలో 9,942 కార్డులు తగ్గినట్లు సదరు శాఖ లెక్కలు



రేషన్ కార్డుతోనే పథకాల లబ్ధి

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే ప్రధానంగా రేషన్ కార్డు ఉండాలి. విద్యా ర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉప కార వేతనాలకు రేషన్ కార్డు ఆదాయ ధ్రువీకరణపత్రంగా ఉపకరిస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవల కార్డు ఉండాలన్నా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నా రేషన్ కార్డు తప్పని సరి. పింఛన్ మంజూరుకు కూడా రేషన్ కార్డు ఉండాల్సిందే. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వేలాది మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డు లేని వారు, సాంకేతిక కారణాలతో కార్డు పొందలేని వారు తమకు తాజాగా మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నారు.

రూ.20 లక్షల పేలుడు పదార్థాల సీజ్

ఆరుగురిపై కేసు.. వైసీపీ నేత సహా మరొకరి అరెస్టు

మార్టూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా నిషేధిత పేలుడు పదార్థాలను అమ్ముతున్న మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుతోపాటు మరొకరిని అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. రూ.20 లక్షల పేలుడు పదార్థాలు, వాటి అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. మార్టూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ తెలిపారు. దాసం హనుమంతరావు నాగరాజుపల్లిలోని గోడౌన్‌లో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచి అమ్మకాలు చేస్తున్నాడు. గ్రానైట్ క్వారీల్లో ముడిరాళ్లను పగలగొట్టేందుకు ఉపయోగించే మందుగుండు సామగ్రి, జిలెటిన్ స్టిక్స్, డిటొనేటర్లు తదితరాలను హనుమంతరావు తెలంగాణ కీసర మండలం అంకిరెడ్డిపాలెంలోని సాల్వో ఇండస్ట్రీస్ నుంచి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఇతడికి దాసం వీరాంజనేయులు సహకరిస్తున్నాడు. ఈ నెల 18న ఎలాంటి బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన 108 బాక్సులు థండర్ బోల్ట్ జిలెటిన్ పేలుడు పదార్థాలను(4,500 కిలోలు), 20 బాక్సులను జిలెటిన్(5 టన్నులు), సాల్వో సూపర్ ఈ-90కి చెందిన 30 బాక్సులు, సాల్వో కార్డ్ 10కి చెందిన 7,500 మీటర్ల స్టాక్‌ను హనుమంతరావు కొనుగోలు చేసి లారీలో తీసుకు వస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీకి సమాచారం అందింది. ఈ క్రమంలో శనివారం నాగరాజుపల్లిలోని గోడౌన్‌ను తనిఖీ చేపట్టి పేలుడు పదార్థాలను సీజ్ చేశారు. తెలంగాణ నుంచి నాగండ్ల ప్రసన్న అనే వ్యక్తి లారీలో తీసుకువస్తున్న పేలుడు పదార్థాలను హనుమంతరావు, దాసం వీరాంజనేయులు, మిగాల నాగవేణుగోపాల్ ముందుగా అనుకున్నట్లు బత్తుల సాంబశివరావు ద్వారా ప్రతాప్‌రెడ్డికి అమ్మాడు. గతంలో వీరు వినుకొండ, గుంటూరులోని పేరేచర్లలో క్రషర్ ఓనర్లకు కూడా అమ్మినట్లు తేలింది. దీంతో హనుమంతరావు, వీరాంజనేయులును అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మరో నలుగురిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు చెప్పారు. బల్లికురవ మండలం కొణిదెన పరిధిలోని హనుమంతరావుకు చెందిన గ్రానైట్ పరిశ్రమలో 2,300 ఎలక్ట్రానిక్ డిటొనేటర్స్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీఐలు ఎం.శేషగిరిరావు, వెంకట్రావు, ఏఎస్ఐ బాషా ఉన్నారు. హనుమంతరావు, వీరాంజనేయులును ఆదివారం అద్దంకి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. వారిని దర్శి సబ్ జైలుకు తరలించారు.



నిందితుల వివరాలు చెప్తున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు శేషగిరిరావు, వెంకట్రావు

మార్టూరులో 24 నుంచి నాటికల సందడి

మార్టూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకారం స్వచ్ఛంధ సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో స్థానిక మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో శ్రీకారం రోటరీ కళాపరిషత్ 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. నాటిక పోటీల బ్రోచర్‌ను ఎఫర్ట్ కార్యాలయంలో ఆదివారం శ్రీకారం, రోటరీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకారం సంస్థ కన్వీనర్ జాష్టి వెంకటమోహనరావు మాట్లాడుతూ కళాపరిషత్ నాటిక పోటీలను నిర్వహిస్తూ మార్టూరు రోటరీ చరిత్ర సృష్టించిందన్నారు. ఏటా సుమారు రూ.6 లక్షలకు పైగా వ్యయంతో, 150 మంది కళాకారులతో నాటిక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశం లో శానంపూడి లక్ష్మయ్య, షేక్ ఖాజాహుస్సేన్, న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు, ఎం.ఈశ్వరప్రసాద్, గుండవరపు వెంకట ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 21 ఏప్రిల్ 2025

పిల్లలకు ఇవి నేర్పించాలి..!

పిల్లలు బడిలో చదువుతున్నప్పుడే... తల్లిదండ్రులు వాళ్లకి చిన్న చిన్న ఇంటిపనులు చేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లలకు బాధ్యత, సహాయం చేయడం, ఆత్మవిశ్వాసం, విచక్షణా జ్ఞానం, సంఘటిత శక్తి విలువ అవగతమవుతాయి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దాన్ని పరిష్కరించుకునే సామర్థ్యం అలవడుతుంది. పిల్లలకు చిన్నతనంలోనే నేర్పించాల్సిన పనులు ఇవే...

- కూరగాయలు కడగడం-కోయడం, మసాలా దినుసుల వివరాలు- వాటి వినియోగం, వంటగది గట్టు తుడవడం, భోజనం వడ్డించడం, పాత్రలు కడగడం లాంటి పనులను పిల్లలకు చెప్పి చేయించాలి.
- నిద్ర లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు సర్దడం, ఉతికిన బట్టలు ఆరవేయడం-మడతపెట్టడం, బీరువాలో బట్టలు సర్దడం నేర్పించాలి.
- లైట్లు, ఫ్యాన్లు, టీవీ, సోఫా, అద్దం, ఇంట్లోని అలంకరణ వస్తువులను దుమ్ము లేకుండా తుడవడం నేర్పించాలి.
- ఇల్లు ఊడవడం, వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వడం లాంటివి నేర్పించాలి.
- న్యూస్ పేపర్లు, పుస్తకాలను అరల్లో సర్దడం చూపించాలి.
- ఇంటికి కావాల్సిన కిరాణా సరుకుల లిస్ట్ రాయడం, బజారు నుంచి కూరగాయలు తీసుకురావడం లాంటివి నేర్పించాలి. ధరలు-నాణ్యతలపై అవగాహన కల్పించాలి
- ఇంటికి వచ్చిన అతిథులను పలుకరించడం, ఆదరించడం, గౌరవించడం నేర్పించాలి.
- టూత్‌బ్రష్‌లు, టూత్‌పేస్టు, షాంపూ, సబ్బులు తదితరాలను వినియోగించుకున్న తరవాత వాటిని యథాస్థానంలో ఉంచడం అలవాటు చేయాలి.
- ఇంట్లో బూజులు దులపడం, మొక్కలకు నీళ్లు పోయడం, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయడం లాంటి పనులు నేర్పించాలి.



వినూత్నం

పచ్చని ప్రకృతి నడుమ గుడారం వేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించే 'క్యాంపింగ్' గురించి మనందరికీ తెలుసు. అయితే ఈ అనుభవానికి మరింత గ్లామర్‌ను జోడించి, సరికొత్త 'గ్లాంపింగ్' పోకడకు శ్రీకారం చుట్టింది కేరళకు చెందిన ఎలీనా థామస్. కొడైకెనాల్‌కు దగ్గర్లోని పూంబరాయ్ గ్రామంలో 'లక్స్‌గ్లాంప్' ఇకో రిసార్ట్స్‌తో వినూత్న గ్లాంపింగ్ అనుభవాలను పంచుతున్న ఎలీనా 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

గ్లాంపింగ్‌తో పర్యాటకానికి కొత్త కళ



నాకు చిన్నప్పటి నుంచి కొత్త ప్రదేశాలను సందర్శించడమంటే చాలా ఇష్టం. ఇదే ఆసక్తి పెళ్లయ్యాక కూడా కొనసాగింది. మా వారు యాంటోనీ థామస్‌తో కలిసి యూరప్ మొత్తం పర్యటించాను. నిర్జనమైన చల్లని ప్రాంతాల్లోని గాజు క్యాబిన్లు మొదలు ఆకట్టుకునే ఆల్పైన్ లాడ్జ్‌లు, డోమ్స్, బబుల్ రిట్రీట్స్‌లో కూడా బస చేశాం. కానీ ఇలాంటి అనుభవాన్ని అందించే సౌకర్యవంతమైన బసలేవీ మన దేశంలో నాకు కనిపించలేదు. ఎలాంటి పర్యాటక ప్రాంతానికి వెళ్లినా పూర్తి విలాసవంతమైన హోటళ్లు లేదా ప్రాథమిక వసతులు కూడా లేని క్యాంపింగ్ గుడారాలు మాత్రమే మాకు కనిపించాయి. కానీ పిల్లలతో, పెద్దలతో కలిసి ఒక ప్రశాంతమైన ప్రాకృతిక ప్రదేశంలో కొన్ని రోజులు సురక్షితంగా గడపాలనుకుంటే, అందుకు తగిన ఏర్పాట్లు బసలో ఉండి తీరాలి. ఆ బస అందమైన ప్రకృతి మధ్యలో ఉండాలి. దాన్లో అన్నిరకాల ఆధునిక సదుపాయాలూ ఉండాలి. ఆ ఆలోచనతో గ్లాంపింగ్‌లో భాగంగా 2018లో 'లక్స్‌గ్లాంప్'కు శ్రీకారం చుట్టాం!

మాది కేరళలోని త్రిస్సూరు. నేను ఎమ్‌బిఎ చదివాను. మా వారు యాంటోనీ థామస్, బిజినెస్ డెవలపర్. వృత్తి రీత్యా మేం దుబాయ్‌లో స్థిరపడ్డాం! లగ్జరీతో పాటు క్యాంపింగ్ అర్థం స్ఫురించేలా మా ఇకో రిసార్ట్‌కు లక్స్‌గ్లాంప్ అనే పేరును ఎంచుకున్నాం.

ప్రకృతి, విలాసాలు కలగలసి...

బస కోసం సంప్రదాయ నిర్మాణాలకు బదులుగా డోమ్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. అందుకోసం పచ్చని ప్రకృతికి ఆలవాలమైన కొడైకెనాల్, మున్నార్‌లలో లక్స్‌గ్లాంప్‌లను నెలకొల్పాం. దక్షిణ భారతదేశంలో ఇలాంటి డోమ్ నిర్మాణాలు ఎక్కడా లేవు. కాబట్టి ఈ వినూత్నమైన డోమ్ స్ట్రక్చర్స్ నిర్మించడం కోసం ఎంతో కష్టపడ్డాం. ముడి సరుకులన్నిటినీ చైనా, బాలిల నుంచి దిగుమతి చేసుకున్నాం. ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా కుటుంబమంతా సౌకర్యంగా బస చేయడానికి తగిన ఏర్పాట్లను డోమ్స్‌లో కల్పించాం. ప్రత్యేకించి లక్స్‌గ్లాంప్ కోసం, కొడైకెనాల్‌కు పాతిక కిలోమీటర్ల దూరంలోని పూంబరాయ్ గ్రామాన్ని ఎంచుకోడానికి కూడా ప్రత్యేక కారణం ఉంది. కోలాహలానికి దూరంగా ప్రశాంతమైన పరిసరాలను వెతుక్కుంటూ కొడైకెనాల్ చేరుకున్నప్పుడు మాకీ కొండ ప్రాంతం కనిపించింది. అప్పట్లో ఈ ప్రాంతమెంతో వెనకబడి ఉంది. సరైన రోడ్డు సదుపాయాలు కూడా లేవు. కానీ శ్రమకోడ్చి లక్స్‌గ్లాంప్‌ను నిర్మించిన తర్వాత, పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ గ్రామానికి కొత్త కళ చేకూరింది. ప్రయాణ సదుపాయాలు కూడా పెరిగాయి. కొందరు స్థానికులకు లక్స్‌గ్లాంప్‌లో ఉద్యోగాలు కూడా కల్పించాం.



వైఫై, టివి లేకుండా....

లక్స్‌గ్లాంప్‌లో బస చేసే అతిథులకు కల్తీ లేని ప్రాకృతిక అనుభవాన్ని అందించాలన్నది మా సంకల్పం. కాబట్టి అత్యవసరమైనప్పుడు మినహా వైఫై సదుపాయాలను అందించకూడదని నిర్ణయించుకున్నాం. అతిథులను ప్రకృతికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే డోమ్స్ లోపల టివి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేదు. భవిష్యత్తులో ఇదే తరహా గ్లాంపింగ్ నిర్మాణాలను భారతదేశంలోని మరిన్ని పర్యాటక ప్రదేశాలకు విస్తరించాలన్నది మా సంకల్పం.

• గోగుమళ్ల కవిత

కస్తూరి పుచ్చకాయ మిల్క్‌షేక్!

వేసవిలో తియ్యని కస్తూరి పుచ్చకాయలు (మస్క్ మిలన్) లభిస్తాయి. వీటిలో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆరోగ్యానికి మంచిది. వీటికి వేసవి తాపాన్ని తగ్గించే శక్తి కూడా ఉంటుంది. ఈ కస్తూరి పుచ్చకాయతో మిల్క్‌షేక్ ఎలా చేయాలో తెలుసుకుందాం..

తయారీ విధానం

- బాగా పండిన కస్తూరి పుచ్చకాయను తీసుకొని.. దాని లోపల ఉన్న గుజ్జును మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దానిలో ఒక గ్లాసు చల్లటి పాలను, తేనెను, పావు స్పూను వెనీలా ఎసెన్స్‌ను వేసి మరో సారి తిప్పాలి.
- దీనిని ఐస్ ముక్కలు వేసిన ఒక గ్లాసులో పోయాలి. మిల్క్‌షేక్ చిక్కగా కావాలనుకొనేవారు పాలను ఫ్రీజర్‌లో పెట్టి .. అది గట్టిపడిన తర్వాత నేరుగా మిక్సీలో వేయవచ్చు.
- పిల్లలకు ఇచ్చే సమయంలో కొద్దిగా ఐస్‌క్రీమ్ వేస్తే రుచి ఇంకా పెరుగుతుంది.



బరువు ఎప్పుడు చూసుకోవాలి..?

మనం సరిగ్గా ఎంత బరువున్నామో తెలియాలంటే విధిగా కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...



- ఉదయం పూట నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో బరువును పరీక్షించుకోవాలి. అప్పుడే సరైన బరువు తెలుస్తుంది.
- వారానికి ఒకసారి బరువును పరీక్షించుకోవడం మంచిది. ప్రతిరోజూ శరీరంలో నీటి శాతం, ఆహారం తీసుకునే విధానం మారుతూ ఉంటాయి. వీటివల్ల బరువులో హెచ్చు తగ్గులు కనిపించవచ్చు. కాబట్టి ప్రతిరోజూ బరువు చూసుకోకూడదు.
- ప్రతీ వారం... ఒకే రోజున ఒకే సమయానికి ఒకే దుస్తులు ధరించి పరీక్షించుకుంటే కచ్చితమైన బరువు తెలుస్తుంది.
- నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా శరీరంలో నీరు నిలుస్తుంది. కడుపు ఉబ్బరంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. ఈ సమయంలో బరువు చూసుకోకూడదు.
- మలబద్ధకం ఉన్న సమయంలో కూడా బరువు చూడకూడదు. తరచూ నీళ్లు తాగుతూ పీచుపదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ సమస్య తీరిన తరవాత మాత్రమే బరువు చూసుకోవాలి.
- రాత్రి పూట పడుకునేముందు బరువు చూడకూడదు.
- భోజనం చేసిన వెంటనే బరువు పరీక్షించుకోకూడదు. తిన్న తరవాత కనీసం పన్నెండు నుంచి ఇరవై గంటలు ఆగిన తరవాతే బరువు చూసుకోవాలి.

అందమైన చర్మం కోసం పానీయాలు..!

సరైన పోషకాలు అందినప్పుడే చర్మం అందంగా కనిపిస్తుంది. ఈ వేసవిలో ఆరోగ్యకరమైన పానీయాలు సేవించి చక్కని చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. చర్మాన్ని మెరిపించే పానీయాలు ఇవే...

- ఎండాకాలంలో తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్లను బయటికి పంపుతాయి. దీంతో చర్మం మృదువుగా మారుతుంది.
- ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా అల్లం రసం కలుపుకుని తాగితే చర్మానికి కొత్త కాంతి లభిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా కలబంద జ్యూస్ కలుపుకుని తాగితే చర్మం తేమగా ఉంటుంది. ఎండ వల్ల కమిలిన చర్మం యథాస్థితికి వస్తుంది. ముఖం మీద మొటిమలు రావు.
- ఒక గ్లాసు వేడి నీళ్లలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే చర్మం బిగుతుగా మారుతుంది. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మ సమస్యలను నిరోధిస్తాయి.
- వేసవికాలంలో వారానికి రెండుసార్లు నారింజ రసం తాగుతూ ఉంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం మీద ముడతలు మాయమవుతాయి.
- ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల ఎ, కె, సి విటమిన్లు అంది చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
- పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కొద్దిగా ఫైబర్, గ్లూకోజ్ తదితరాలు కూడా ఉంటాయి. తరచూ పుచ్చకాయ రసం తాగుతూ ఉంటే చర్మం ఛాయగా ఉంటుంది.
- ప్రతిరోజూ కీర దోస జ్యూస్ తాగితే...చర్మం పొడిబారకుండా ఉంటుంది.



బాల్యమంతా కష్టాలు... వైవాహిక జీవితం క్షణక్షణం నరకం. 34 ఏళ్ల వయసులో ముగ్గురు పిల్లలతో వీధిన పడిన నీతా... విధిని ఎదిరించి నిలిచారు. పురుషుల ఆధిపత్యం ఉన్న రవాణా రంగంలో... పదమూడు బస్సుల యజమానిగా తనదైన గుర్తింపు సాధించారు. సమాజ సేవలో కూడా 'నేను సైతం' అంటున్న నీతా ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

ఆత్మస్థైర్యమే ఆయుధంగా...



"చిన్న వయసులో నా తోటి పిల్లలను చూస్తే నాకు చాలా అసూయగా ఉండేది. వారిలో వెల్లివిరిసే సంతోషం నాకు లేనందుకు బాధ కలిగేది. ఎందుకంటే... ఏ రోజూ రాత్రి మా అమ్మ చేతుల్లో తన్నులు తినకుండా, ఏడవకుండా నేను నిద్రపోలేదు. మా నాన్న రోజూ తాగి వచ్చి అమ్మను కొట్టేవాడు. అతణ్ణి ఎదిరించలేని నిస్సహాయతను అమ్మ నా మీద ప్రదర్శించేది. నేను పుట్టకపోయినట్లైతే... తను ఎప్పుడో ఈ లోకాన్ని వదిలేసేదాన్ని అని అనేది. నాకు ఆరేళ్ళ వయసున్నప్పుడు... నాన్న వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. నాన్న నన్ను పెంచలేనంటూ మా తాతయ్య ఇంట్లో వదిలేశాడు.

నిత్యం వేధింపులే...

మాది మహారాష్ట్రలోని ఒక పల్లెటూరు. బడికి వెళ్ళింది తక్కువే. అయితే చదవడం, రాయడం బాగానే నేర్చుకున్నాను. పెద్ద చదువులు చదివించే స్థోమత మా తాతయ్యకు లేదు. పద్నాలుగేళ్ళ వయసులో నాకు పెళ్ళి చేసి భారం దించుకున్నారు. అప్పటికి నా భర్తకు ఇరవై రెండేళ్ళు. ఏడాదికే మొదటి బిడ్డను కన్నాను. ముంబయిలోని అత్తవారింటికి వెళ్ళాక... నా బతుకూ మా అమ్మలాగే అయింది. నా భర్త కూడా రోజూ తాగేసి వచ్చేవాడు. నన్ను నానా మాటలతో వేధించేవాడు. దురలవాట్ల కారణంగా అతనికి పని దొరికేది కాదు. దాంతో డిప్రెషన్‌కు గురయ్యాడు. మాకు ముగ్గురు పిల్లలు. ఒక మురికివాడలో మా నివాసం. కుటుంబ పోషణ భారం నా మీదే పడింది. ఒక స్కూల్‌లో ఆయాగా చేరాను. స్కూల్ బస్సులో పిల్లలను ఇళ్ళ దగ్గర నుంచి బడికి తీసుకువెళ్ళి, తిరిగి వారి ఇళ్ళ దగ్గర దింపడం నా బాధ్యత. ఆ సమయంలోనే తోటి ఆయాల దగ్గర స్కూటర్ నడపడం నేర్చుకున్నాను. నా ఉత్సాహం చూసి... స్కూల్ వ్యాన్లు, బస్సులు నడపడం అక్కడి డ్రైవర్లు నేర్పించారు. ఇదంతా నా భర్తకు నచ్చలేదు. ఆయా పని మానేయాలని గొడవ చేసేవాడు. నిత్యం శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. ఇదే పరిస్థితి కొనసాగితే... పిల్లల బతుకు కూడా నా మాదిరిగానే అవుతుందనుకున్నాను. వారికి మంచి భవిష్యత్తు కావాలంటే ఈ వాతావరణంలో వాళ్ళు పెరగకూడదనిపించింది. అలా పెళ్ళైన ఇరవై ఏళ్ళ తరువాత నా భర్తను విడిచి పెట్టాలని నిశ్చయించుకున్నాను.

ఎనిమిదేళ్ళ శ్రమ

భర్తను వదిలి వచ్చాక ఎన్నో ఇబ్బందులు ఎదురైనా... ఏనాడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. నేను నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఆసరాగా నిలిచింది. లైసెన్స్ తీసుకున్నాను. నేను పని చేస్తున్న స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి... వ్యాన్ డ్రైవర్‌గా కొత్త జీవితం మొదలుపెట్టాను. నా భర్త, అతని మిత్రులు నన్ను రకరకాలుగా వేధించారు. అనరాని మాటలెన్నో అన్నారు. డ్రైవర్‌గా పనిచేసే మహిళ అంటే సమాజానికి కూడా చిన్నచూపు ఉంటుంది. అయినా నేను కుంగిపోలేదు. పని ఉండని సమయాల్లో నా పిల్లలతో కలిసి చదువుకోవడం మొదలుపెట్టాను. బ్యాంక్ అధికారులను కలిసి, నా కథ చెప్పాను. వ్యాన్ కొనుగోలు చేయడానికి రుణం ఇవ్వాలని కోరాను. మా స్కూల్ యాజమాన్యం హామీతో రుణం మంజూరయింది. కొత్త ప్రయాణం ఆరంభమయింది. నా భర్తతో విడాకులు తీసుకున్నాను. పిల్లల చదువుకు, మేము జీవించడానికి అయ్యే ఖర్చులు మినహా... మిగిలిన డబ్బును పొదుపు చేశాను. అప్పును సకాలంలో తీర్చడంతో... బస్సు కొనుగోలుకు రుణం దొరికింది. అప్పుడే 'శ్రీ నీతా ట్రావెల్స్' పేరిట ఒక సంస్థను ప్రారంభించాను. దాదాపు ఎనిమిదేళ్ళపాటు నేను పడ్డ శ్రమ ఫలితాన్ని ఇచ్చింది. ఇప్పుడు మా ట్రావెల్స్ ద్వారా పదమూడు బస్సులు నడుపుతున్నాను. ఎక్కువశాతం బడిపిల్లల కోసమే తిరుగుతాయి. వాటిద్వారా ముప్పై మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాను.



ధైర్యంగా నిలబడాలి...

మరోవైపు నేను నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరింది. నా పిల్లలు బాగా చదువుకున్నారు. మా అబ్బాయి కెనడాలో స్థిరపడ్డాడు. అమ్మాయిలిద్దరూ నాకు వ్యాపారంలో సాయం చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. మా ట్రావెల్స్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలు నేనే చూస్తాను. 'నీతా ఫౌండేషన్' పేరుతో ఒక సంస్థను స్థాపించి... పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. ఇప్పుడు నన్ను కలిసే అమ్మాయిల్లో చాలామంది నేనే వారికి స్ఫూర్తి అని చెబుతూ ఉంటారు. మీలా ధైర్యంగా ఉండాలని కోరుకుంటూ ఉంటామంటారు. ధైర్యంగా నిలబడితే అనుకున్నవి సాధించగలమని నేను చెబుతాను. పెళ్ళి అనేది మహిళలకు అంతిమ గమ్యంగా సమాజం పరిగణిస్తుంది. వైవాహిక జీవితంలో హింసకు గురైనవారిలో ఎంతోమంది దాన్ని మౌనంగా భరిస్తున్నారు. లోకం ఏమనుకుంటుందోననే భయం, ఆర్థికపరమైన అభద్రత, పిల్లల భవిష్యత్తుపై బెంగ... ఇలా దీనికి ఎన్నో కారణాలున్నాయి. తలరాతను తిట్టుకుంటూ, కష్టాలను భరించినంత కాలం... జీవితం మరింత దుర్భరంగా మారుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. విధిని ఎదిరించి పోరాడితేనే గెలుపు అందుతుంది. దానికి నేనే ఉదాహరణ."

అల్లంతో కొలెస్ట్రాల్‌కు చెక్

శరీరంలో చెడు కొలెస్ట్రాల్ చేరడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తప్రసరణ వ్యవస్థ మందగిస్తుంది. దీంతో శరీర భాగాలకు రక్తాన్ని పంపడం కోసం గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. క్రమంగా గుండె బలహీనమవుతుంది. ఇలాంటి పరిస్థితులకు కారణమైన చెడు కొలెస్ట్రాల్‌ను నివారించడానికి అల్లం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్లాన్ని ఎలా వాడాలో తెలుసుకుందాం...



- అల్లాన్ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోసి మెత్తని పేస్టులా చేయాలి. ఒక గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక చెంచా అల్లం పేస్టు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటిని బాగా మరిగించి గ్లాసులో పోసుకుని మెల్లగా తాగాలి. ఇలా వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి అయిదు అల్లం ముక్కలు వేసి బాగా ఉడికించాలి. తరవాత ఈ నీళ్లను గ్లాసులోకి వడబోసి అందులో మూడు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. వారానికి ఒకసారి ఇలా తాగితే గుండె సిరల్లో పేరుకున్న కొలెస్ట్రాల్ కరిగిపోతుంది.
- ఒక అంగుళం పొడవున్న అల్లం ముక్కను సన్నగా తురమాలి. ఈ అల్లం తురుములో ఒక చెంచా బెల్లం పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తింటే శరీర భాగాల్లో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. బెల్లానికి బదులు తేనె కూడా కలుపుకోవచ్చు.
- అల్లాన్ని చిన్న ముక్కలుగా కోసి కొద్దిగా ఆరబెట్టాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండు అల్లం ముక్కలను నోట్లో వేసుకుని నములుతూ రసాన్ని మెల్లగా మింగాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకోదు. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- ఉదయాన్నే టీ పెట్టుకునేటప్పుడు అందులో చిన్న అల్లం ముక్కను కచ్చాపచ్చాగా దంచి వేయాలి. ఈ అల్లం టీ తాగడం వల్ల కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఏర్పడదు. ఒక గ్లాసు మజ్జిగలో కొద్దిగా అల్లం తురుము కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది.

అక్రమ మట్టి తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

3 పొక్లెయినర్లు, 18 ట్రాక్టర్లు స్వాధీనం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మంచినీటి చెరువుల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కన్నెర్ర చేసింది. ఆదివారం పలు ప్రాంతాల్లో ఏక కాలంలో అధికారులు దాడులు నిర్వహించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ



ఉన్నవ గ్రామంలో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గ్రామంలోని ఆచార్యుల చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో 3 పొక్లెయినర్లు, 18 ట్రాక్టర్లను స్వాధీనం చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ పి.శివాజీ మాట్లాడుతూ మట్టి అక్రమ తవ్వకాలను ఊరుకోబోమని హెచ్చరించారు. మైనింగ్ శాఖ అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదుకు సిఫార్సు చేస్తామన్నారు. ఈ దాడుల్లో మైనింగ్ జియాలజిస్ట్ అనిల్ బాబు, అగ్రికల్చరల్ ఆఫీసర్ ఆదినారాయణ, మైన్స్ అండ్ జియాలజీ అధికారిణి నాగిని పాల్గొన్నారు.

నీటి తొట్టెలో పడి మూడేళ్ల బాలుడి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నీటి తొట్టెలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని మిట్టమీదపల్లెలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆవుల శశిధర్‌రెడ్డి, మౌనిక కొడుకు నిహాస్‌రెడ్డి. శనివారం రాత్రి మౌనిక స్నానానికి వెళ్లగా నిహాస్‌రెడ్డి ఆడుకుంటూ మరుగుదొడ్డి బయట ఉన్న మూడు అడుగుల నీటి తొట్టె వద్దకు వెళ్లాడు. అందులోని బంతిని తీసేందుకు ప్రయత్నించి తొట్టిలో పడిపోయాడు. తల్లి మౌనిక బయటకు వచ్చి చూసేసరికి కొడుకు తొట్టిలో పడి ఉండడాన్ని గమనించింది. హుటాహుటిన వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువు కట్టను చదును చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అలకాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గ్రామ శివారు సమీపంలో బేతాళం వెంకటకృష్ణంరాజుకు రొయ్యల చెరువులో మధ్యాహ్నం ట్రాక్టర్‌తో డ్రైవర్ అక్కల కనకారెడ్డి కట్టను చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రొయ్యల చెరువులో పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కనకారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చందోలు ఎస్‌ఐ ఎంవీ శివకుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని చినపులుగువారిపాలెం గ్రామానికి చెందిన అక్కల కనకారెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. కనకారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉపాధి కూలీలకు ఊరట

● విడుదలైన వేతన బకాయిలు రూ.51.37 కోట్లు ● నేటి నుంచి కార్మికుల ఖాతాలకు సొమ్ము జమ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

ఉపాధి కూలీలకు వేతన బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం నుంచి రెండు రోజుల్లో కూలీల ఖాతాలకు నగదు జమచేయనుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ. 51.37 కోట్లు వేతన బకాయి ఉంది. జనవరి 15 నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు వేతనాలను చెల్లించలేదు. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కూలీకి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.గతేడాది కూడా రెండు దఫాలుగా నెలల తరబడి వేతనాలు నిలిచిపోయాయి. ఈ ఏడాది కూడా మూడు నెలలకు పైగా వేతనాల చెల్లింపులు జరగలేదు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలను విడుదల చేసింది. దీంతో కష్టజీవులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కల్లా ప్రతి ఒక్కరి ఖాతాలో బకాయిలను జమ చేసేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పల్నాడు జిల్లాకు రూ.19.86 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ.8.69 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.22.82 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి.

రూ.154.46 కోట్లు కోసం కొంత కాలం ఆగాల్సిందే..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రహదారులు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు చేపట్టారు. గోకులం షెడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. కూలీల సొమ్ము చెల్లించిన ప్రభుత్వం మెటీరియల్



ఉపాధి పనుల్లో కార్మికులు

బిల్లుల చెల్లింపుల కోసం కొంత కాలం వేసి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారం రోజుల్లో ఈ బకాయి కూడా విడుదల కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో రూ.80.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ. 58.18 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు బిల్లులు చెల్లించాలి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అట్టహాసంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

● కనపర్తి ఆధ్వర్యంలో భారీ బైకు ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. వికాస్ నగర్‌లోని ఆయన కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్ వరకు టీడీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదిక మీద కేకును గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్, పెమ్మసాని రవి శంకర్, డేగల ప్రభాకర్ చేతుల మీదుగా కట్ చేశారు.డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యేలు క్షీరాభిషేకం చేశారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని తెలుగు మహిళా అధ్యక్షురాలు దాసరి జ్యోతి గుమ్మడి కాయతో దిష్టి తీశారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, పెమ్మసాని చేతుల మీదుగా మహిళల కు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక అయితే, ఆత్మవిశ్వాసానికి, అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని కొనియాడారు. తెలుగు ప్రజల గుండెల్లో చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన్ను అక్రమంగా అరెస్టు చేసి 55 రోజులు జైల్లో నిర్బంధించినప్పుడు ప్రపం చ వ్యా ప్తంగా వెల్లువెత్తిన నిరసనలు ఆయన సత్తా ఏంటో తెలియజేశాయని గుర్తుచేశారు. నసీర్ మాట్లాడుతూ సామాన్యుడైన తనకు టిక్కెట్ ఇచ్చి గెలిపించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాల వారికి అన్నీ విధాలా న్యాయం చేసిన వక్తి చంద్రబాబు అని భావోద్వేగమయ్యారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌ని జగన్ అన్ని విధాల భ్రష్టు పట్టించాడని, సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిన పెట్టి.. చెడిపోయిన వ్యవస్థలను బాగు చేసేందుకు దేవుడు ఆయనకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరారు. సీఎం పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు కనపర్తిని ఎమ్మెల్యేలు స త్కరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షులు డేగల ప్రభా కర్, పిల్లి మాణిక్యరావు, నాయకులు మద్దిరాల మ్యానీ, అడకా శ్రీను, కార్పో రేట ర్లు వేములపల్లి శ్రీరామ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, య ల్లావుల అ శోక్, నూకవరపు బాలాజీ, స్మితా పద్మజ, భారతి, నాయకులు మదమంచి శ్రీనివాస్, పఠాన్ అస్మతుల్లా, పేరం సంతోష్ రెడ్డి, చంద్రగిరి బాబు, యాకో బు వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సీఎం పుట్టినరోజు వేడుకలు

పెదకాకాని, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామం ఎస్టీ కాలనీలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొని, మాట్లాడారు.



వర్సిటీ మెయిన్ గేట్ వద్ద కేక్ కట్‌చేస్తున్న వర్సిటీ సిబ్బంది

ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి బాటలో పయనించాలన్నారు. విశిష్ట అతిథి వర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థను అద్భుతమైన రీతిలో చక్కదిద్దడంలో సీఎం చంద్రబాబు ప్రణాళికలు సత్ఫలి తాలిస్తున్నాయన్నారు.స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ఆయన జీరో పావర్టీ కోసం పీ-4 విధానాన్ని రూపొందించారని వివరించారు. స్కోప్ ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను అభినందించారు. అనంతరం సీఎం జన్మదిన కేకును కట్ చేశారు. పేదలకు నూతన వస్త్రాలు బహూకరణ, భోజన వితరణ కార్యక్రమాలు జరిగాయి. వర్సిటీ సిబ్బంది కోడూరి కనకరాజు, ఎస్.కోటేశ్వరరావు, బి.రత్తయ్య, వాసు, చారి, శ్రీను, మేక ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో డీసీఎం విస్తృత తనిఖీలు

గుంటూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మాచర్ల, మంగళగిరి, రేపల్లె రైల్వేస్టేషన్లలో పర్యటించి ప్రయాణికులకు లభిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ప్రయాణికులకు సౌకర్యార్థం స్వచ్ఛంధ సంస్థల సహకారంతో చల్లని తాగు నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయించారు. ఈస్టర్ పండుగ కావడంతో మాచర్ల రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు అధిక సంఖ్యలో వచ్చారు.



జీఆర్‌పీ అధికారులతో డీసీఎం కమలాకర్‌బాబు

దీంతో అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం జీఆర్‌పీ అధికారులతో డీసీఎం సమీక్ష నిర్వహించారు. ఆకతాయిలు రైళ్లపై రాళ్లు రువ్వడం వంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. రైళ్లలో దొంగతనాలను నిరోధించాలని, పశువుల యజమానులతో తరచుగా అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి, రైల్వే ట్రాక్‌కు సమీపంలోకి వాటిని తీసుకురాకుండా స్వీయ నియంత్రణ పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీలు పి.ప్రభాకర్‌రావు, అక్కేశ్వరరావు, సీఐ షేక్ నఫీజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్న వ్యక్తికి రిమాండ్

దుర్గి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలకు హాజరయ్యేందుకు వెళ్తున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వాహనాన్ని తన కారు అడ్డంగా పెట్టి అడ్డుకున్న వ్యక్తిని దుర్గి పోలీసులు అరెస్ట్ చేశారు. దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మండల కేంద్రమైన దుర్గిలో ఏర్పాటు చేసిన సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి బయలు దేరారు. దుర్గి మిర్చి యార్డు దాటగానే మాచర్ల పట్టణానికి చెందిన షేక్ జాకీర్ తన ఇన్నోవా కారుతో వేగంగా వెళ్తూ ఎమ్మెల్యే కారును క్రాస్ చేశాడు. అనంతరం దుర్గి మెయిన్ రోడ్డు వద్ద ఉద్దేశపూర్వకంగా తన కారును అడ్డుగా ఉంచాడు. ఎస్కార్ట్‌గా ఉన్న దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్ కారును అడ్డు తీయాలని కోరగా జాకీర్ దురుసుగా వ్యవహరించాడు. దీంతో జాకీర్‌ను ఎస్‌ఐ అరెస్ట్ చేసి, మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ 15 రోజుల రిమాండ్ విధించారు. దీంతో జాకీర్‌ను గురజాల సబ్ జైలుకు తరలించారు.

నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- భారత్ జోడో అభియాన్ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్



గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికా రంలో వున్న బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన లోక్‌సభ నియోజకవర్గాల పున ర్విభజన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ దేశాన్ని ముక్కలుగా చేసే ప్రమా దంలోకి నెట్టి వేస్తుందని స్వరాజ్ ఇండియా భారత్ జోడో అభియాన్ వ్యవస్థాపకుడు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ సభ్యుడు యోగేంద్ర యాదవ్ అన్నారు.ఆదివారం గుంటూరులో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన-దుష్ఫలితాలు అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి యోగేం ద్ర యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. మన భారతదేశం భిన్న భాషలతో భిన్న మతాలతో భిన్న భౌగోళిక స్వరూపాలతో వెలుగొందుతూ ఐకమత్యంగా ప్రపంచపటంలో ఉన్నతంగా కొనసాగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితులలో మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వారి ఆధిపత్య ధోరణితో అందరి స్వేచ్ఛను అణగదొక్కేలా కుట్ర జరుగు తుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గాల పునర్విభజనపై మౌనం వహిస్తూ రాష్ట్రాలపై బీజేపీ శాశ్వత ఆధిపత్య ధోరణికి మద్దతు పలుకుతూ, దక్షిణాది ప్రాంతాల భవిష్యత్తు హక్కులని కాలరాస్తున్నారని ఘాటుగా విమర్శించారు. భారత దేశంలో ఫెడరల్ వ్యవస్థ సజీవంగా కొనసాగించాలంటే 543 లోక్‌సభ స్థానాలన శాశ్వతంగా యథాస్థితిలో ఉంచాలన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఆయుదాలుగా మార్చుకొని ప్రతిపక్ష పార్టీలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు.ఈ కార్య క్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, బీపీ మండల్ సేన రాష్ట్ర నేత డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్ వలీ, డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రముఖ న్యాయవాది చందోలు శోభారాణి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆనందం 'కొలువు'దీరింది

- మెగా డీఎస్సీ విడుదలపై అభ్యర్థుల్లో హర్షాతిరేకం
- ఏళ్లుగా ఎదురు చూస్తూ.. శిక్షణ
- 2018 టీడీపీ ప్రభుత్వంలో.. మళ్లీ ఇప్పుడే..



డీఎస్సీపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన నిరుద్యోగులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్లగా టీచర్ కొలువులకు ఎదురు చూపులు చూస్తూ.. కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగుల్లో మెగా డీఎస్సీ విడుదల పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అంటూ ఊ రించింది. చివరకు అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. అయితే కూటమి ప్ర భుత్వం కొలువుదీరిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ విడుదలపైనే చేశారు. సాంకేతిక కారణాల వల్ల నోటిఫికేషన్ కొంత జాప్యం అయినా ఎట్టకేలకు మెగా డీఎస్సీ ప్రకటన విడుదలైంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీచర్ పోస్టులు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వం 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, పరీక్షలు నిర్వహించింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 8వేల పోస్టులు భర్తీ చేయడం జరిగింది. తాజా కూటమి ప్రభుత్వమే మెగా డీఎస్సీకి నగారా మోగించింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వాటా 1,134 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ యాజమాన్యాలకు సబ్జెక్టుల వారీగా ఇప్పటికే పోస్టుల వివరాలు వెలువడ్డాయి. ఆయా యాజమాన్యాల ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 42, హిందీ 57, ఇంగ్లిష్ 69, గణితం 35, ఫిజికల్ సైన్స్ 58, బయోలాజికల్ సైన్స్ 86, సోషల్ స్టడీస్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166, ఎస్టీటీ 521 పోస్టులు చొప్పున చేయనున్నారు. గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీచేస్తారు.

దార్శనికుడు సీఎం చంద్రబాబు: కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలను అందరికంటే ముందుగా గుర్తించి, అందుకు అనుగుణమైన పథకాలు, విధానాలను రూపొందించే దార్శనికుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో జోన్ -5 ఇన్‌చార్జి ముఖ్యమంత్రి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కేంద్ర మంత్రితో పాటు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, నగర ఇన్ చార్జి మేయర్ షేక్ సజీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అద్యంతం స్ఫూర్తిదాయకమన్నారు. తన విద్యార్థి దశలోనే విశిష్ట నాయకత్వ లక్షణాలు ప్రదర్శించారని కొనియాడారు. కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి అమరావతిని అభివృద్ధి పథంలో చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఎమ్మెల్యే నసీర్, ఇన్‌చార్జి మేయర్ సజీలా, డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధి చెందాలన్నా, పేద బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతి సాధించాలన్నా.. ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు : ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రను దేశం నలు మూలల చాటేలా కృషి చేస్తున్న దార్శనికుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా పట్టణ టీడీపీ కార్యాలయంలో వేడుకలలో ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు.



మాచవరంలో చంద్రబాబు పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

అనంతరం యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందడంలో చంద్రబాబు కృషే కీలకపాత్ర అన్నారు. బిల్‌గేట్స్‌కు, బిల్‌క్లింటన్‌కు అయినా ఆంధ్రప్రదేశ్ అంటే చంద్రబాబు అనే గుర్తుకు వస్తుందన్నారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి లేదన్నారు. మెగా డిఎస్సీతో వేలాదిమందికి నిరుద్యోగ సమస్య తొలగనున్నదన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో, గ్రామీణ ప్రాంతాలలో కూటమి నేతలు కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయివృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో చైర్ పర్సన్ కొత్త వెంకటసుబ్బారావు, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, షేక్ బాబావలి, కనిగిరి శ్రీను, కోట హరి, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, పణితి రవి, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివరావు, కొమ్మినేని రామచంద్రరావు, ఎల్‌వీఆర్, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, రామ్మూర్తి, సయ్యద్ అమీర్‌అలి, మందా డేవిడ్, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, మేకల రాంబాబు, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, నల్లపాటి నెహ్రూ, కార్ సైదా, మేకల సాంబశివరావు, యడ్లపల్లి శివ, నారాయణ, కొక్కెర కొండలు, గుడె విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

దుర్గి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన దుర్గిలోని బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు.



దుర్గిలో చంద్రబాబు పుట్టినరోజు కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 యేళ్ల వయసులో రాష్ట్రాన్ని అభివృద్ధిలో పెట్టిస్తున్న నేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, మేకల దాసు, లింగా రమేష్, మాగులూరి నారయ్య, లింగా బ్రహ్మయ్య, జానకి రామయ్య, కటకం రామారావు, వెలిదండి శ్రీనివాసరావు, జక్కా కొండలు, రాయపాటి శ్రీను, సైదులు, శెట్టిపల్లి నరసింహారావు, శ్రీరాం కాశిబాబు, వంకమళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలీ క్లినిక్‌ను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జీ రామకృష్ణ ప్రసాద్ గుంటూరు కొత్తపేటలోని పాలీ క్లినిక్ ను ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ నెల 14 వ తేదీన నగరంలో ని ఏటుకూరు బైపాస్ లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోడె ను జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ చొరవతో పాలీ క్లినిక్ లో చేర్చి వైద్య



పాలీ క్లినిక్‌లో ఉన్న కోడెను ఆప్యాయంగా నిమురుతున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

సేవలు అందిస్తున్నారు.ఆ కోడెకు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఓ నరసింహారావు నేతృత్వంలో ప్రముఖ సర్జన్ ఎల్ నాగేశ్వరరావు ప్రత్యేక శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం కోడెను ఆసుపత్రి ఇన్ పేషంట్ వార్డులో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. దానిని చూసేందుకు జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ గత మంగళవారం కూడా పాలీ క్లినిక్ కు రావటం జరిగింది. మళ్ళీ ఆదివారం రెండో సారి కూడా అక్కడ కు వచ్చిన ఆయన కోడె ను పరిశీలించి, వివరాలు అడిగీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ఆర్ రత్న జ్యోతి ఇతర పశువైద్యులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 514.80 అడుగులు ఉంది. ఇది 139.96 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

బాపట్ల వార్తలు


వేమూరులో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు


బాపట్లలో కేక్‌ను పార్టీశ్రేణులతో కలిసి కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ధీరోదాత్త గుణం కలిగిన నాయకుడు చంద్రబాబు

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

● ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

వేమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ధీరోదాత్త గుణం కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను వేమూరులో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆనందబాబు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బర్త్ డే కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు కోసం తెలుగువారి ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాపింజ చేసేందుకు ముఖ్యమంత్రి హోదాలోనే కాకుండా జాతీయ స్థాయిలో టీడీపీకి ప్రధాన కర్తగా ఉండి ప్రజాహితైషిగా చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి భానుగంగాధర్, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, గాజుల వెంకటసుబ్బయ్య, నరహరిప్రసాద్, కన్నెగంటి సత్యనారాయణ, వరప్రసాద్, తేజా ప్రసాద్, కొల్లి వెంకటేశ్వర్లు, మన్నె పసి, ఘంటా స్వాతి, డి.సుధాకర్, కోగంటి శ్రీనుబాబు, యలవర్తి సురేంద్ర, కోగంటి రాజేష్, ఘంటా శ్రీను, గోపినాథ్, శివకృష్ణ వివిధ విభాగాలకు చెందిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండల పరిధిలోని గ్రామాలలో టీడీపీ శ్రేణులు చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు అన్నదానాలు నిర్వహించారు.

కొల్లూరులో...

కొల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ దార్శనికుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొనియాడారు. ఆదివారం కొల్లూరులో చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 75 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా మొదలైన ఆయన రాజకీయ జీవితం నేటికి 50 ఏళ్లు పూర్తయిందని, 75 ఏళ్ల జీవితంలో ఆయన ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ఎక్కడ కుంగిపోకుండా మళ్లీ పునరుత్తేజంతో పార్టీని ముందుకు తీసుకు వెళుతూ ఆంధ్రప్రదేశ్‌కు నాల్గవసారి ముఖ్యమంత్రిగా పని చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళుతున్నారన్నారు. అనంతరం తుమాటి శ్యాంబాబు అందించిన నూతన దుస్తులను పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే అందజేశారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలకు వడ్డన చేశారు. తొలుత క్రాప రోడ్డు నుంచి భారీ ర్యాలీగా తరలివస్తూ గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ కార్యాలయంలో నూతన కంప్యూటర్, ప్రింటర్లను శ్యాంబాబు బహూకరించగా వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీసీ చైర్మన్ యలవర్తి కోటేశ్వరరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుంకర రామమోహనబాబు, పార్టీ నాయకులు పబ్బిశెట్టి సత్యకుమార్, సనకా పాపారావు, పెదపూడి నాగరాజు, కొమ్ము తులామాను, కాసరనేని మోహన్, గాదె చంటి, యడ్ల శ్రీను, బీజేపీ నాయకులు మందా జనార్ధన్, గళ్లా వెంకట కోటేశ్వరరావు, గోగినేని చంద్రం, జనసేన మండల కన్వీనర్ బొందలపాటి చలమయ్య, కూటమి నాయకులు, అభిమానులు, మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాపట్లలో...

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యమంత్రి జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలనందిస్తూ విజన్ ఉన్న నాయకునిగా అందరి మన్ననలను పొందుతున్నారన్నారు. చంద్రబాబునాయకత్వంలో పనిచేయటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, చెన్నుపాటి కిషోర్, కూచిపూడి శ్యామ్ సుందర్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజనీ, లీగల్ సెల్ నాయకుడు ఊట్ల రామారావు, జి.గిరిజారాణి, శీలం శ్రీనివాసరావు, చేజర్ల సతీష్, జిట్టా ప్రమీలారాణి, కూచిపూడి ఝాన్సీరాణి, రమాదేవి, కిషోర్ పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయం వద్ద....

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయం వద్ద ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి రైల్వేబోర్డుమెంబర్ పఠాన్ రాజేష్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాతగా, అమరావతి రూపశిల్పిగా ముఖ్యమంత్రి చేస్తున్న సేవలు ఆదర్శణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు భోగిరి రామారావు, గవిని దుర్గాప్రసాద్, నక్కా ప్రకాష్‌కర్నేటి కొండలు, పాపయ్య, మాడా బుజ్జిబాబు, నర్రా కొండలు, తోట నాగేశ్వరరావు, కె.ప్రసన్న, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసి ప్రెసిడెంట్ శ్రీకాంత్, బూత్ ఇన్‌చార్జి అమర్‌నాథ్, ప్రభాకరరావు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, సీతారామయ్య పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కర్లపాలెం శాఖా గ్రంథాలయంలో సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారులు పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ, బాలబాలికల గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయంలో ఎండీ అఫ్జల్‌తో కలిసి టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ కనుమూరి సాంబమూర్తిరాజు, గోకరాజు నరసరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పందరబోయన విష్ణువర్ధన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

● చందోలు గ్రామపంచాయతీ కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాశీం ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, చందోలు-2 నీటి సంఘం అధ్యక్షుడు, డీసీ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, టీడీపీ నాయకులు అఖిల్, మజహరుల్లా, ఫెడ్రిక్, సాధిక్, జానీ, ఇనాయతుల్లా, బాజి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సంగుపాలెంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. సంగుపాలెంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కడియాల ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోడేటి నీలాంబరం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బర్మా దిలీప్, పీటర్ పాల్, డానిరాజు, టి.మహేష్, టి.నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● భవనంవారిపాలెం గ్రామపంచాయతీలో టీడీపీ గ్రామ అధ్యక్షులు కలకోట చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు భవనం బసివిరెడ్డి, చందోలు కోటి లింగాచారి, ఇంటూరి శివయ్య, పలువురు గ్రామపెద్దలు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, ఏప్రిల్, 20 : మండల పరిధిలోని గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమృతలూరులోని బాబుజగ్జీవన్‌రామ్ పార్కు వద్ద చంద్రబాబు చిత్రపటానికి వేమూరు మార్కెట్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్ పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, శ్రీను, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూచిపూడిలో యలవర్తి బ్రహ్మనందం, యలమంచిలి బాజీ, తుమ్మల భుజంగరావు, కిషోర్, యలవర్తి రఘుబాబు, మట్లపూడి జయపాల్, కూచిపూడి వెంకటేష్, యలవర్రులో గోవాడ సాగునీటి సంఘం వైస్ డీసీ కావూరి సత్యనారాయణ, పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పి.వెంకట సుబ్బారావు, మాథ్యూస్, వసంతరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో....

చెరుకుపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలో మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనగాని శివప్రసాద్‌కి ఘన స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం 20 కిలోల భారీ కేక్‌ను అనగాని శివప్రసాద్ కట్‌చేసి నాయకులకు తినిపించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు వెళ్ళాలంటే అది ఒక్క చంద్రబాబు వలనే అవుతుందన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దివిరాంబాబు, కొనకాల రవికిరణ్, తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, చెరుకుపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు నాగుల పున్నారావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరం మండలంలో...

నగరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : విజన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు నగరం మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ కేక్ కట్‌చేసి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యకృషీవలుడు, సంపద సృష్టికర్త, ఆంధ్రప్రదేశ్‌కు మార్గదర్శకుడైన చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం టీడీపీ నేతలు నగరంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జడ్పీటీసీ మేకా వెంకటశివరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు చింతల సుబ్బారావు, టీడీపీ నేతలు లుక్కా, గుడారంకయ్య, చింతారావు, జడ్పీటీసీ మాన్యం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దేవుడిని ఆత్మతో, సత్యంతో ఆరాధించాలి

● కాకినాడ సీఎల్ఎఫ్ డైరెక్టర్ ఏఈ జాయ్‌కుమార్


సీబీజెడ్ చర్చిలో ఈస్టర్ సందేశం ఇస్తున్న కాకినాడ సీఎల్ఎఫ్ డైరెక్టర్ ఏఈ జాయ్‌కుమార్

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దేవుడిని ఆత్మతోను, సత్యంతోను ఆరాధించాలని కాకినాడ సీఎల్ఎఫ్ డైరెక్టర్ ఏఈ జాయ్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని సీబీజెడ్ చర్చిలో ఆదివారం ఈస్టర్‌పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సన్‌రైజ్ సర్వీస్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమం చర్చిలో యేసుక్రీస్తు పునరుత్థానం గురించి వివరించారు. సంఘకాపరి పవిత్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు జాయ్‌కుమార్ ముఖ్యవక్తగా పాల్గొని క్రీస్తు సందేశం అందించారు. కార్యక్రమంలో రాహుల్‌దేవ్, జె.సాధుహెర్బర్ట్, జె.క్రిష్టాఫర్, ప్రేమచంద్, ఏలేషా తదితరులు పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో ఈస్టర్ ఆరాధనలో పాల్గొన్నారు.

● పట్టణంలోని 32వ వార్డు హయ్యర్‌నగర్‌లోని ఫాదర్ హయ్యర్ మెమోరియల్ లూథరన్ దేవాలయంలో ఈస్టర్ వేడుకలలో డాక్టర్ సీహెచ్ యేసురత్నం పాల్గొన్నారు. హయ్యర్‌నగర్ ప్యారిష్ పరిధిలోని జగన్నాథపురం, చెంగ్రాయుడుతోట సంఘస్తులు తమ పూర్వీకుల సమాధుల వద్దకు ఆదివారం తెల్లవారుజామున క్యాండిల్స్‌తో ప్రదర్శనగా వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం చర్చిలో జరిగిన ఆరాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘకాపరి డాక్టర్ చింతా యేసురత్నం, చింతా రాధారత్నం, గ్రామపెద్దలు మోటాన వెంకటస్వామి, సలగల రమేష్‌బాబు, పీసీసీ మెంబర్లు పెరికల రూత్‌జైశీల్‌బాబు, జోగి ఆదినారాయణ, సంఘపెద్దలు బిళ్ళా పెద్దా, అడే వంశీ, దోనేపూడి వరకుమార్, మేకల యాకోబు, పేర్లి సత్యదేవ్‌కుమార్, సలగల భావన్న, యూత్‌కమిటీ సభ్యులు, స్త్రీల సమాజం వారు పాల్గొన్నారు. అదేవిధంగా బాపట్ల పట్టణ, మండలంలోని పలు దేవాలయాలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈస్టర్ వేడుకలలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


ఈస్టర్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే నరేంద్రవర్మను సత్కరిస్తున్న సంఘ కాపరులు, పెద్దలు

క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈస్టర్ వేడుకలకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రేమ, కరుణ, దయ, జాలి కలిగి జీవించాలన్నారు. విద్యానగర్ సాల్వేషన్ ఆర్మీ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మను సంఘస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత టీసీ పి.దేవవరం, సీవో మేజర్ డి.యోబు, జ్యోతి, డి.విజయ్‌కుమార్, సునీత, పెద్దలు డాక్టర్ కాగిత వరప్రసాదరావు, జివి మణిభూషణ్, మేడిద చక్రవర్తి, డి.ఉదయభాస్కరరావు, మల్లెల శామ్యూల్, షమీర్‌చందు, పసుమర్తి యలమంద, కనమాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. అదేవిధంగా చెంగ్రాయుడుతోట చర్చిలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని ఈస్టర్ ప్రార్థనలు చేశారు.


చెంగ్రాయుడుతోట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

● బాపట్ల మండలంలోని మూలపాలెం ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఈస్టర్ ఆరాధనలో జనసేన నాయకులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకులు విన్నకోట సురేష్ పార్టీశ్రేణులతో కలిసి ప్రార్థనలో పాల్గొని ప్రతి ఒక్కరు యేసుక్రీస్తు ప్రేమను కలిగియుండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సురేష్‌ను సంఘస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, కర్లపాలెం మండలపార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, నాయకులు పసుపులేటి మహేష్, సంగీత ఏసోబు, విష్ణుమొలకల చంద్రమోహన్, బడుగుబాబు, అంకిరెడ్డి అనూష్, దాసరి వినోద్, మాడసాని బాలాజి, కె.నరేంద్ర, దండుప్రోలు కిషోర్, బాలకోటి పాల్గొన్నారు.

● వేమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్‌ను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. సమాధుల వద్దకు వెళ్లి తమ కుటుంబాలలో చనిపోయిన పెద్దలను గుర్తు చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధులను శుభ్రం చేసి రంగులతో అలంకరించారు. అనంతరం పాస్టర్లు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించి తమ ప్రసంగాల ద్వారా ఏసుక్రీస్తు పునరుద్ధానం గురించి సందేశం అందించారు. వేమూరులోని రక్షణ సైన్యం దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి క్రీస్తు గీతాలను ఆలపించారు.

● అమృతలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఈస్టర్ సందర్భంగా పలు మందిరాల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈస్టర్ పురస్కరించుకుని వేకువజామున పూర్వీకుల సమాధులు వద్ద కొవ్వొత్తులను వెలిగించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

పోలేరమ్మతల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


శ్రీపోలేరమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీపోలేరమ్మతల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ఉన్న శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి 108 కలశాలతో విశేష అభిషేకం, అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి మహాకుంభహారతిలిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ పూజల్లో పాల్గొన్నారు. అన్నంసతర్పణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భీమా కోటేశ్వరరావు, బూర్లె రామసుబ్బారావు, బూర్లె రత్తయ్య, రమేష్‌కుమార్, కృష్ణమూర్తి, రౌతు రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పేరలి గౌడపాలెంలో కాటూరి శివరామకృష్ణ (సాంబయ్య) మృతి చెందారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో ఆదివారం గ్రామస్థులు ఈవూరి శ్రీనివాసరావు, కాటూరి చిన్ని, గేరా ఏసుబాబు, విక్టర్ బాబు, జక్రయ్య, విజయరాజు చేతులమీదగా రూ.5 వేలు మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు.

హోటళ్ళు, లాడ్జీలలో పోలీసుల తనిఖీలు

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలను నిరోధించటంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 32 పోలీసుస్టేషన్‌ల పరిధిలో 75 హోటళ్ళు లాడ్జీలను తనిఖీ చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌లు, నేరాలకు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకునే లక్ష్యంగా తనిఖీలు నిర్వహించామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు సమాచారం ఉంటే 100/112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. బాపట్లలో సీఐ ఆర్.రాంబాబు సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు.

సమ్మర్ స్టోరేజి ట్యాంక్ పూర్తిగా నింపేందుకు చర్యలు : డీఈ

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను పూర్తి స్థాయిలో నీటితో నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన మోటర్లతో నీటిని చెరువులోకి పంపుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. పూర్తి స్థాయిలో చెరువును నింపాలని ఆదేశించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్నిరకాల చర్యలు చేపట్టి నీటి సరఫరా చేస్తున్నామన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు భరోసా చంద్రబాబు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి


ఎన్టీఆర్‌సర్కిల్లో కేక్‌కట్‌చేస్తున్న టీడీపీనాయకులు అనగాని, గూడపాటి, పంతాని

రేపల్లె, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రపంచపటంలో నెంబర్‌వన్ స్థానంలో నిలిపే సత్తా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినం సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ సర్కిల్లో భారీ కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపి తీర్చిదిద్దగల సమర్థత ఉన్న నాయకుడు చంద్రబాబేనన్నారు. కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటి చైర్మన్ పంతాని మురళీధరరావు మాట్లాడుతూ పోలవరం నిర్మాణంతో రాష్ట్రం అన్నపూర్ణగా మారనుందని, పోలవరం నిర్మాణ ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం మూడు వేల మందికి అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగినేనిపట్టాభి రామారావు, తాతా ఏడుకొండలు, దాసరి నాగరాజు, కొపనాతి రాజశేఖర్, షేక్ ఖాదర్‌బాషా, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, దండుప్రోలు, రేపల్లె సురేష్, గోగినేని శ్రీనివాసరావు, జీవీ నాగేశ్వరరావు, యరగళ్ళ శ్రీనివాసరావు, ఆలూరి డానియేలు, డొక్కు బుజ్జి, కేసన రామకృష్ణ, పీవీ చింతారావు తదితరులు పాల్గొన్నారు.


నిజాంపట్నం సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య

● సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని భారీకేక్‌ను నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధిచెందాలన్నా, భావితరాల వారికి భవిష్యత్తు ఉండాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సంపూర్ణ ఆరోగ్యంతో అనేక ఆనందకరమైన పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మరో చోట కార్యక్రమంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డొక్కు శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, యార్లగడ్డ పాండురంగారావు, కర్ణ శ్రీనివాసరావు, కుక్కల వెంకటేశ్వరరావు, బట్టు మల్లికార్జునరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కేటాయింపు అసంబద్ధం

● రాష్ట్రోపాధ్యాయ సంఘం

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు చాలా అసంబద్ధంగా, గందరగోళంగా ఉందని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బడుగు శ్రీనివాస్, గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతిగ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తామని పత్రికలలో ఊదరగొట్టిన విద్యాశాఖాధికారులు ఇప్పుడు 60రోల్ దాటితేనే ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తామని మాటమార్చటం ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయటమేనన్నారు. రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అనంతవరంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. మండల పరిధిలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1978-79 సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు 45 ఏళ్ల తరువాత ఒకరినొకరు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు తెలిపారు.

బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిరసన

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు చేసిన దోపిడీకి నిరసనగా బీజేపీ యువమోర్చా నాయకులు ఆదివారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలకు పాల్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మారం మణి, బొమ్మిశెట్టి ప్రసాద్, శ్రీనివాస్, సుజిత్, సూర్య, బాలాజీ, దుర్గాప్రసాద్, సురేష్, మద్దుల వెంకటేశ్వర్లు, బండ్రెడ్డి రజనీ, బూర్లె రత్తయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘురామయ్య మృతి తీరనిలోటు

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దర్శిపెదమస్తాన్ నగర్‌కు చెందిన టీడీపీనాయకుడు తోట రఘురామయ్య ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధనరెడ్డి పార్టీశ్రేణులతో కలిసి వెళ్ళి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తోట మల్లేశ్వరి నారాయణరావు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, అంకాల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పులి వాసు, గవిని హరిబాబు తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మహాకరుణ అహింసా శాకాహార ర్యాలీ

చెరుకుపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి పొన్నపల్లి ఆగ్రహారంలోని శ్రీరామకృష్ణ తపోవనం, వానప్రస్థాశ్రమం వరకు మెగా మహాకరుణ శాకాహార ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పీఆర్ పరమేశ్వర్‌రెడ్డి, పిరమిడ్ సేవాదళ్ ప్రాజెక్ట్ చైర్మన్ వెలగపూడి లక్ష్మణరావు, గుంటూరు, బాపట్ల పీఎస్ఎస్ఎం అధ్యక్షులు పి.మాధవవర్మ, భూపతిరాజు, పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, గొల్లపూడి రామారావు, పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షుడు వంగర శ్రీనివాస సిద్ధాంతి పాల్గొన్నారు.

20 ఎకరాల గడ్డివామి దగ్ధం

నగరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దవరం గ్రామపంచాయతీలో మూగజీవాలకు ఏర్పాటు చేసిన 20 ఎకరాల పశుగ్రాసమైన వరి గడ్డివామిని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. పెద్దవరం సర్పంచ్ కోటా హరేరామ్ నగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మాట్లాడుతూ తమ ప్రత్యర్థులే ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. రూరల్ సీఐ సురేష్ మాట్లాడుతూ ఫిర్యాదులు స్వీకరించామని క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డాబా పైనుంచి పడిన చిన్నారి

కొల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల చిన్నారి మూడు అంతస్థుల పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కొల్లూరుకు చెందిన పెనుమూడి నాంచారయ్య, చిట్టెమ్మల కుమార్తె అన్వితలు ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు అంతస్థుల డాబాలో అద్దెకు ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో చిన్నారి ప్రమాదవశాత్తుపై నుంచి కిందపడిపోయింది. తలకు తీవ్ర గాయం కావటంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరు వైద్యశాలకు తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పుష్కరకాలం తరువాత మేజర్‌లలో పూడికతీత

- అద్దంకి డివిజన్‌లో రూ.2.28కోట్లతో పనులు
- సాగునీటి ప్రవాహానికి తొలగనున్న అడ్డంకులు
- టీడీపీ కూటమి వచ్చాక ముందస్తుగా నిర్వహణ
- గత ఏడాది మంత్రి గొట్టిపాటి చొరవతో గట్టెక్కిన సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువలకు నీటి విడుదల జరుగుతుందంటే రైతులలో ఆందోళన ఉండేది. సాగర్ కాలువలలో పూడిక పేరుకు పోయి ఉండడంతో చివరి ఆయకట్టు వరకు నీటి విడుదల జరుగుతుందా లేదా అనే అనుమానాలు ఉండేవి. ఈ నేపథ్యంలో రైతులు ఆలస్యంగా వరి సాగు చేపడుతుంటారు. గత ఏడాది సకాలంలో సాగర్ కాలువలకు నీటి విడుదల జరిగినా... నీటి ప్రవాహం ముందుకు సాగక రైతులు ఇబ్బంది పడ్డారు. దీంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సాగర్ కాలువలకు నీటి విడుదల చేసిన తరువాత రైతుల ఆందోళనను గుర్తించి ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేయించి తాత్కాలికంగా పూడిక తీత పనులు చేయించడంతో గత ఏడాది సాగునీటి కష్టాల నుంచి రైతులు గట్టెక్కారు.

సాగర్ కాలువలకు పుష్కరకాలం తరువాత పూడికతీత పనులు చేపట్టారు. 2012 సంవత్సరంలో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులలో భాగంగా సిమెంట్ లైనింగ్ చేశారు. దీంతో సుమారు ఐదారు సంవత్సరాల తరువాత నీటి ప్రవాహనికి ఎలాంటి అడ్డంకులు లేకుండా దిగువ ఆయకట్టుకు కూడా సాగు నీటి సరఫరా జరుగుతుంది. అయితే మేజర్ కాలువలలో పూడిక పేరుకు పోవడంతో గత ఐదారు సంవత్సరాలుగా సాగు నీరు ముందుకు కదలక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం


వెంపరాల మేజర్‌లో పూడికను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వచ్చిన వెంటనే రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేయాలన్న సంకల్పంతో మేజర్ కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. అద్దంకి డివిజన్ పరిధిలో మేజర్ కాలువల మరమ్మతులకు 2.28 కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయి. వీటితో ఆయా మేజర్‌లలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. గత పక్షం రోజులుగా పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి సబ్ డివిజన్‌లో రూ.1.50కోట్లతో, సంతమాగులూరు సబ్ డివిజన్ పరిధిలో రూ.53.59లక్షలతో, కోనంకి సబ్ డివిజన్‌లో రూ.24.50లక్షలతో మరమ్మతు పనులు ప్రారంభించారు. అద్దంకి సబ్ డివిజన్ పరిధిలో పమిడిపాడు మేజర్‌కు రూ.94.70 లక్షలు, అద్దంకి మేజర్‌కు రూ.23.94


పూడిక తీసిన తర్వాత వెంపరాల మేజర్ కాలువ

లక్షలు, వెంపరాల మేజర్‌కు రూ.21.28లక్షలు, గుంటుపల్లి మేజర్‌కు రూ.10.62లక్షలు కేటాయించారు. ఇప్పటికే అత్యధిక శాతం పనులు ప్రారంభమయ్యాయి.

నాడు ముందే హడావుడి

నేడు నీటి విడుదల నిలిపిన వెంటనే పనులు

సాగర్ కాలువలలో మరమ్మతు పనులు నీటి విడుదలకు కొద్దిరోజులు ముందు హడావుడిగా పూర్తి చేసి కాంట్రాక్టర్‌లు, అధికారులు జేబులు నింపుకునే వారు. పనులు చేసీచేయక ముందే నీటి విడుదల జరిగేది. దీంతో మరమ్మతు పనులు చేసారో... లేదో కూడా అర్థం కాని పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వంలో పద్ధతి మారింది. సాగర్ కాలువలకు నీటి విడుదల నిలిపి వేసిన వెంటనే పనులు ప్రారంభించారు. నెలరోజుల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో తాగునీటి అవసరాలకు మేలో నీటి విడుదల చేసే లోపలే పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో పూడిక తీత పనులలో మాయాజాలం చేసే అవకాశం తక్కువగా ఉంటుందనే అభిప్రాయం ఉంది. సుమారు పుష్కర కాలం తరువాత ఎట్టకేలకు మేజర్ కాలువలలో పూ డికతీత, జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న యువనేత హర్షవర్ధన్, నాయకులు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ కాలనీలో తెలుగుయువత ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం హర్షవర్ధన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. 10రోజులపాటు జరిగే టోర్నమెంట్‌లో జిల్లాలోని 43 టీమ్‌లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో సీఐ సుబ్బరాజు, టీడీపీ నేతలు కాకాని అశోక్, గార్లపాటి శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కౌన్సిలర్‌లు, నేతలు పాల్గొన్నారు.

నేడు చీరాలలో కలెక్టర్ 'మీకోసం'

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సోమవారం మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటమురళి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి ఎమ్మెల్యే కొండయ్యతోపాటు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు హాజరవుతున్నారు. ప్రజలు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

వక్ఫ్ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం

పేరాల(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా చీరాల పరిధిలోని ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు ఆదివారం పేరాల ముస్లిం షాదీఖానాలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై ఇప్పటికే సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లింలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆయా బోర్డులో వచ్చే ఆదాయంతో పేద ముస్లిలం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. వచ్చే శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు అబ్దుల్ రహీమ్, షౌకత్ అలీ, అల్లా భక్షి, అబ్దుల్ సలీమ్, అబీబుల్లా, కబీర్, సీపీఐ నాయకులు బాబురావు పాల్గొన్నారు.

వేసవి కబడ్డీ శిక్షణ ప్రారంభం


వేసవి కబడ్డీ శిక్షణను ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బారావు

చినగంజాం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, స్థానిక బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆదివారం డాక్టర్ నల్లూరి సుబ్బారావు ప్రారంభించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా బాస్కరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన క్రీడాకారులకు పౌష్టికాహారం, క్రీడా దుస్తుల నిమిత్తం లక్షరూపాయిల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ సుబ్బారావు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టుకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావులు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 50 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారిలో ప్రతిభ చూపిన 15 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు కళాశాల ఆవరణలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన ఆరుగురిని తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఏ.వేణుగోపాల్, తెలంగాణ, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, చైర్మన్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి డి.రమేష్, ఉపాధ్యక్షులు ప్రసాద్, బికే.స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.గిరిబాబు, కార్యవర్గసభ్యులు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏబీసీ కాలువ కట్టపై ముళ్లచెట్ల తొలగింపు


రామాంజనేయపురం వద్ద కాలువ కట్టపై ఉన్న ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలం నుంచి అద్దంకి బ్రాంచ్ కాలువ కట్టపై చిట్టడవిని తలపించేలా ఉన్న ముళ్ల చెట్లను అధికారులు తొలగించే చర్యలు చేపడుతున్నారు. ఆదివారం బల్లికురవ మండల పరిధి రామాంజనేయపురం గ్రామ సమీపంలో ఉన్న ఏబీసీ కాలువ కట్టపై ఉన్న ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. దీంతో కాలువలో నీరు దిగువ భూములకు సకాలంలో చేరడంతోపాటు రైతులకు ఇబ్బందులు తొలగనున్నాయి. కొన్ని చోట్ల కాలువలోకి చెట్లు వ్యాపించి ఉన్నాయని రైతులు అంటున్నారు. ఏబీసీ కాలువ మెత్తం రెండు వైపులా ముళ్ల చెట్లను తొలగిస్తే కాలువ కట్టపై రాక పోకలకు కూడా ఇబ్బందులు ఉండవని రైతులు చెప్తున్నారు.

ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు


అద్దంకిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


పర్చూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని టీడీపీ నేతలు కొనియాడారు. పట్టణంతోపాటు గ్రామాలలో ఆదివారం సీఎం చంద్రబాబు పుట్టినరోజు కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. రాజీవ్‌కాలనీలో కేక్‌ను మంత్రి గొట్టిపాటి హర్షవర్ధన్ కేక్ కట్ చేశారు. మెయిన్ రోడ్డులో గొట్టిపాటి సైన్యం ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయం సమీపంలో, 18, 19 వార్డులతో పాటు పలు చోట్ల కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమాల్లో పట్టణాధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు కంపా రజనీ, తిరుపతమ్మ, విజయలక్ష్మి, కాకాని అశోక్, రామారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కరి పరమేష్, రమేష్, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, లహరి, కోనేటి అనిల్, నరేంద్ర, స్టాలిన్, మురళీసుధాకర్, రామాంజనేయులు, కొండలు, అనిల్ పాల్గొన్నారు. ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలో నాగినేని రామకృష్ణ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుక ఘనంగా నిర్వహించారు.

పంగులూరు : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రాన్ని ప్రగతపథంలో ముందుకు నడుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ నేత అని టీడీపీ నాయకులు కొనియాడారు. ఆదివారం చంద్రబాబు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. బీసీ బాలికల వసతి గృహంలో కేక్ కట్ చేసి, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, రామసుబ్బారావు, ఏడుకొండలు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత బాబు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి ప్రదాత, నిరంతర శ్రామికుడు సీఎం చంద్రబాబు అని, మెగా డీఎస్సీ ప్రకటనతో వేల ఉద్యోగాల కల్పనతో శ్రామికుడయ్యారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు జరిగాయి. క్యాంపు కార్యాలయంలో కేక్ చేశారు. ఏరియా హాస్పిటల్ వద్ద గర్భిణులు, రోగులకు పండ్లు, బ్రెడ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. రక్తదానాన్ని అందజేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నేటికీ నవయువకుడిలా, రాష్ట్ర భవిష్యత్తు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న యోధుడు బాబు అని కొనియాడారు. ముందుగా బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు : సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటాల వద్ద కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షులు మక్కెన శేఖర్‌బాబు నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, సురేష్, చింపయ్య, శ్రీనివాసరావు, దుర్గా, గౌస్ బాషా పాల్గొన్నారు. నాగులపాలెంలో వేడుకలు నిర్వహించారు.

కారంచేడులో : కారంచేడు మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి, మిటాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామయ్య, డీవీఎల్, దగ్గుబాటి చౌదరి పాల్గొన్నారు.

ఇంకొల్లు : చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి పాలేరు రామకృష్ణ, మార్క్, సంధ్యారాణి, అనంతలక్ష్మి, జనసేన పార్టీ ఇన్‌చార్జి విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు : ముఖ్య మంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఏ లూరి క్యాంపు కార్యాలయం, మార్టూరు లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అమ్మ ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చినగంజాం : సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య కేకు కట్ చేశారు. పెదగంజాం గ్రామ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, రాఘవయ్య, అబ్దుల్‌కలాం ఆజాద్, లక్ష్మి, నీలాయపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఏలూరి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


పెదగంజాంలో కే కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఇంకొల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

సుదూర ప్రాంతాల నుంచి హాజరై మొక్కులు చెల్లించుకున్న భక్తులు

పేరాల(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పేరాలలోని శ్రీ పేరాల పోలేరమ్మ అమ్మవారి ఆలయ 50వ వార్షికోత్సవ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పోలేరమ్మకు మొ క్కులు చెల్లించేందుకు ఆదివారం సుదూ ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చా రు. ఈక్రమంలో పెద్ద ఎత్తున జల బిం దెల కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ప్రత్యేక పూజలతో పాటు మొక్కులు చెల్లించి అమ్మను వేడుకున్నారు. ఉత్సవాలు మంగళవారంతో ముగిస్తాయని కమిటీ ప్రతినిధులు చెప్పారు.


జల బిందెలతో వస్తున్న మహిళా భక్తులు

ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

ఏటా ఉత్సవాల్లో పాల్గొంటున్నా

ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఏటా పోలేరమ్మ ఉత్సవానికి వచ్చి మొక్కు తీర్చుకుంటాను. కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పోలేరమ్మ.

- పూజిత, హైదరాబాద్

అమ్మ చెప్పింది ఈ అమ్మపై నమ్మకముంచమని

అమ్మమ్మ ఊరు కావడంతో ఏటా ఇక్కడ పూజలకు వస్తుంటాను. మా అమ్మ చెప్పింది పోలేరమ్మపై నమ్మకం ఉంచమని. అందుకనే బాగా చదువు రావాలని మొక్కుకున్నా. అందుకే ఏటా పూజల్లో ఉత్సాహంగా హాజరవుతా.

- నాగ లిఖిత, రావూరు


బిక్షాల కాలనీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్

అద్దంకిటౌన్ : క్రీస్తు సమాధి నుంచి మూడవ రోజు సజీవుడుగా లేచారని పలువురు పాస్టర్‌లు తెలిపారు. ఈస్టర్ పండుగను బిక్షాల కాలనీ చర్చిలో పాస్టర్ ఇటికాల యోహాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పసుమర్తిపాలెం, కట్టకిందపాలెం, మొండితోకపాలెం, ఎన్‌ఆర్‌నగర్, రామ్‌నగర్‌తో పాటు పలు కాలనీలలోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. బిక్షాల కాలనీల చర్చి వద్ద 1500 మందికి మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమం లో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

చీరాల : అన్ని చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రార్థనలు చేశారు. శ్మశాన వాటిక వద్దకు వెళ్లి సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు సువార్త సందేశాన్ని ఇచ్చారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

చినగంజాం : మండల పరిధిలోని గ్రామాల్లో ఈస్టర్‌ను ఆదివారం అన్ని చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే సమాధితోటకు వెళ్లి వివిధ రకాల పూలతో అలంకరించి, కొవొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కడవకుదురు, పెదగంజాం, చినగంజాం, సంతరావూరు, గొనసపూడి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, చింతగుంపల్లి తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భార్యను హత్య చేసిన భర్త

యనమదల గ్రామంలో ఘటన


మంగమ్మ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అనుమానం పెనుభూతంగా మారింది. జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్త కాలయముడై భార్యను కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో శనివారం అర్ధరాత్రి (ఆదివారం తెల్లవారుజాము) జరిగింది. గ్రామంలోని నీలం శ్రీనివాసరావు అనే వ్యక్తి భార్య మంగమ్మ (45) తలపై గడ్డపారతో కొట్టి హత్య చేశారు. ఆ వివరాలను ఎస్‌ఐ రత్నకుమారి వివరించారు. కూలినాలి చేసుకుంటూ జీవనం సాగించే శ్రీనివాసరావు మంగమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో అమ్మాయి శ్రీలక్ష్మికి గతంలోనే వివాహం చేశారు. కుమారుడు సాయి విజయవాడలో ఉద్యోగం చేస్తున్నారు. అయితే ఇంటిలో భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. రెండురోజులు కిందట మంగమ్మ విజయవాడలో ఉంటున్న చెల్లెలు కుమార్తె నిశ్చితార్థానికి వెళ్లి శనివారం రాత్రి వచ్చారు. అయితే ఇంటిలో రాత్రి నిద్రపోతున్న సమయంలో భార్యపై ఎప్పటి నుంచో అనుమానం పెంచుకున్న భర్త శ్రీనివాసరావు గడ్డపారతో తలపై కొట్టగా ఆమె మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని తాడుతో కట్టి ఈడ్చుకుంటూ సమీపంలో ఖాళీ పొలంలో పడేశాడు. ఆదివారం చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ రామాంజనేయులు, ఎస్‌ఐ రత్నకుమారి పరిశీలించారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్రగాయాలు

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి యువకునికి తీవ్రగాలయాలైన ఘటన ఆదివారం కారంచేడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకూరిపేటకు చెందిన షేక్ ఉమర్, మరో ఇద్దరు స్నేహితులతో కలసి బైక్‌పై చీరాల వాడరేవు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. కారంచేడు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఉమర్‌కు తీవ్రగాయలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

తమిళనాడులో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

గోవాడలో విషాదఛాయలు



మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీస్తున్న గజఈతగాళ్లు

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి సరదాగా బావిలో ఈతకు దిగి మృతి చెందిన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. అద్దంకి మండలం గోవాడకు చెందిన మాదాల నాగేశ్వరరావు కుమారుడు వెంకటేష్ (20) తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగం సమీపంలో ఉన్న ధనలక్ష్మి శ్రీనివాసన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం సరదాగా ఈతకు సమీపంలోని బావిలోకి ట్యూబ్‌లతో దిగాడు. ప్రమాదవశాత్తు ట్యూబ్‌ల నుంచి జారిపోయిన వెంకటేష్ నీటిలో మునిగి మృతి చెందాడు. వెంకటేష్‌ను కాపాడేందుకు మరో విద్యార్థి ప్రయత్నించి మృతి చెందినట్లు తెలుస్తుంది. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు తమిళనాడుకు బయలుదేరి వెళ్లారు. నాగేశ్వరరావు వ్యవసాయం కుటుంబం అయినప్పటికీ కుమారుడిని ఉన్నత చదువులు చదించాలన్న ఉద్దేశంతో తమిళనాడులోని కళాశాలలో ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు కాగా కుమార్తెకు వివాహం అయింది. చేతికి అంది వచ్చే వయస్సులో కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తీరంలో నేర నియంత్రణపై పర్యవేక్షణ

రామాపురం(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తీరంలో ఎటువంటి నేరాలు జరుగకుండా నిత్యం పర్యవేక్షణ ఉండాలని రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి తీరంలో డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. అనుమానిత స్థావరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వాడరేవులో వివాదంపై జిల్లా యంత్రాంగం ఆరా

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో నెలకొన్న సీఐ, ఏఎస్సై, వ్యాపారి వివాదంపై జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే నిఘా వర్గాల ద్వారా పూర్తిస్థాయిలో నివేదిక తెప్పించుకుని, ఆ అంశంపై ఆరా తీస్తుంది. దీనిపై వివాదానికి తెరలేపిన వారిని సోమవారం విచారించనున్నట్లు సమాచారం. విచారణ అనంతరం ఏ క్షణమైనా చర్యలు ఉండవచ్చని పోలీసు శాఖలో చర్చ సాగుతుంది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి సమాచారం ఇప్పటికే ఏసీబీకి కూడా చేరినట్లు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తులపై కూడా ఆరా తీసే అవకాశం ఉన్నట్లు సమాచారం.